నిమజ్జనానికి పాట్లు

- లోపభూయిష్టంగా ఘాట్లు
- చీకట్లోనే బతుకమ్మ ఆటలు
- చెరువుల వద్ద కరువైన రక్షణ చర్యలు
- పట్టింపులేని అధికారులు

ముస్తాబాద్: తెలంగాణలో ఆడపడుచులు ఎంతో సంబరంగా జరుపుకునే బతుకమ్మ పండగ ఎంతో ప్రత్యేక మైనది. పూలనే పూజించే అరుదైన ఈ పండగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం. తెలంగాణ ప్రజల ఐక్యతను, ఆత్మగౌరవాన్ని ప్రపంచం నలుదిశల చాటిన ఘనత ఈ పండగకే దక్కుతుంది. అంతటి ప్రతిష్టాత్మకమైన బతుకమ్మ పండగకు అవసరమైన అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చూసుకోవాల్సిన అధికారులు చూపుతున్న అశ్రద్ధ పల్లెల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఆడబిడ్డలు బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో కనీసం విద్యుత్ సౌకర్యం కల్పించే విషయంలో కూడా అధికారులు అశ్రద్ధ చేస్తున్నారని, ఇక బతుకమ్మ ఘాట్ల పరిస్థితి దయనీయంగా ఉందని మహిళలు ఆరోపిస్తున్నారు.

ముస్తాబాద్ మండలంలోని కొన్ని గ్రామాల్లో బతుకమ్మ ఘాట్ల వద్ద పరిస్థితి చూస్తే కనీస సౌకర్యాలు కూడా లేవు. చెరువులు, కుంటలు, వాగులు పుష్కలమైన నీటితో కళకళలాడుతుండగా, నిమజ్జనానికి వెళ్లే వారికి కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.



ఆవునూర్‌లో పెద్ద చెరువు బతుకమ్మ ఘాట్ పరిస్థితి



రక్షణలేని గూడెంలోని చింతల చెరువు బతుకమ్మ ఘాట్



తీసుకోవాల్సిన చర్యలు

➡ ఎంగిలి పూల బతుకమ్మ మొదలు.. సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పూల పండగకు అన్ని ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదే.

➡ బతుకమ్మ పండగకు అవసరమైన ఏర్పాట్లు చేసి, వాటికి బిల్లులు తీసుకునే వెసులుబాటు పంచాయతీలకు ఉంది.

➡ గ్రామాల్లో బతుకమ్మ ఆడుకునే ప్రధాన కూడళ్ల వద్ద లైట్లు ఏర్పాటు చేయాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి.

➡ నిమజ్జనం చేసే చెరువులు, కుంటలు, వాగుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి. లైట్లు ఏర్పాటు చేసి, చెత్తను తొలగించాలి. పిచ్చిమొక్కలు తీసివేయించి, శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు బాగా ఉండడంతో ఎవరు నీటి లోతులోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

➡ ప్రమాదకరమని భావించే చెరువులు, కుంటల వద్ద అవసరమైతే బారికేడ్లు నిర్మించాలి.

➡ చెరువులు, వాగుల్లోకి ఎవరు కూడా దిగకుండా రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పర్యవేక్షించాల్సి బాధ్యత పంచాయతీ అధికారులపైనే ఉంది.

ఘాట్ల వద్ద ఇదీ పరిస్థితి

- ముస్తాబాద్ పెద్ద చెరువులో వందలాది మంది ఒకేసారి బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఇక్కడ ఘాట్లు విశాలంగా ఉన్నప్పటికీ సద్దుల బతుకమ్మ నాటికి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేస్తారు. నిండుకుండలా ఉన్న ఈ చెరువు ఘాట్లవద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.
- పోతుగల్ చిన్న స్కూల్ వద్ద వున్న కుంటలో నిమజ్జనం చేసే ప్రాంతంలో లైట్లు లేవు. నీటిలోకి పిల్లలు దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గంగమ్మ వాగు వద్ద కూడా అదే పరిస్థితి. పంచాయతీ అధికారులు జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. అలాగే పాఠశాల వెనుకగల కుంటలో నిమజ్జనానికి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలి.
- ఆవునూర్ పెద్ద చెరువు వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలి. వీఆర్ఏలు లేకపోవడంతో, పోలీసులే ఆ బాధ్యత తీసుకోవాలి.
- నామాపూర్ రెండు చెరువుల్లో అదే పరిస్థితి.
- గూడెం చింతల చెరువు వద్ద కట్టపై లైట్లు లేవు. అలాగే బతుకమ్మ ఘాట్ల వద్ద నీటిలోకి పిల్లలు దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చీకోడు చింతల చెరువు, కొత్త చెరువుల ఘాట్ల వద్ద లైట్లు లేక, సెల్‌ఫోన్ల లైట్ల సహాయంతో నిమజ్జనం చేస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.
- నిండుకుండలా ఉన్న చీకోడు చింతల చెరువు, కొత్త చెరువుల వద్ద ఘాట్లు నిర్మించకపోవడంతో, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- బందనకల్ చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జనానికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు.

ముందస్తు ఏర్పాట్లు చేయాలి



ఎంగిలి పూల బతుకమ్మకు ముందే చెరువుల వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి. చెరువుల వద్ద చెత్త వేస్తున్నారు. శానిటేషన్ చర్యలు తీసుకోవాలి. దుర్వాసన వస్తోంది. బతుకమ్మ ఘాటు వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాం.

– చిన్ని దేవేంద్ర, ఆవునూర్

లైట్లు లేని చోట జనరేటర్లు పెడుతాం



పోతుగల్‌లో ఐదుచోట్ల బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. లైట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఘాట్ల నిర్మాణం అవసరం లేదు. ర్యాంప్‌లు ఏర్పాటు చేశాం. లైట్లు లేనిచోట జనరేటర్లు పెడుతున్నాం. పండగ మొదటి రోజు నుంచే ఏర్పాట్లు చేస్తాం.

– ఆఫీర్, పంచాయతీ కార్యదర్శి, పోతుగల్

పంచాయతీలకు ఆదేశాలిచ్చాం



బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. చెరువులు, వాగుల వద్ద పోలీసులు రక్షణ ఏర్పాట్లు చూస్తారు. పారిశుద్ధ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంగిలి పూల బతుకమ్మ నుంచే ఏర్పాట్లు చేస్తాం.

– రమాదేవి, ఎంపీడీవో, ముస్తాబాద్

క్లుప్తంగా

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



శాంపిల్ సేకరిస్తున్న విద్యార్థులు

బోయినపల్లి: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చని, రైతులు ప్రతీ ఏటా భూసార పరీక్షలు చేయించాలని బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మండలంలోని రత్నంపేట గ్రామంలో రైతుల చేలలో సోమవారం భూసార పరీక్షలకు సంబంధించిన మట్టి, నీటి శాంపిళ్లు తీసుకున్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు సౌమ్య, సరిత, ప్రత్యూష, శ్రీకాంత్, వామన పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ స్థలం కేటాయింపు



స్థలాన్ని చదును చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ స్థలం కేటాయించడంతో రైతులు సోమవారం ట్రాక్టర్లు, జేసీబీలతో చదును చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో తమ బాధలు తప్పనున్నాయని రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ మాసిరెడ్డి అవినాష్ రెడ్డి, ఎంపీటీసీ బైరినేని రాము పనులను పర్యవేక్షించారు.

సంబురంగా బతుకమ్మ



వేములవాడ: రాజన్న ఆలయ ఆవరణ సోమవారం రాత్రి బతుకమ్మల సందడితో కిటకిటలాడింది. ఓ వైపు భక్తుల రద్దీ, మరోవైపు స్థానికుల బతుకమ్మ ఆటతో రద్దీగా మారింది.

ఆశీర్వాద సభకు తరలిరండి

ఎల్లారెడ్డిపేట: ఈ నెల 17న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, దుమాల, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి సోమవారం కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

దేవీ వైభవం



ముస్తాబాద్: పోతుగల్‌లో అమ్మవారు



కోనరావుపేటలో మంగళహారతులిస్తున్న మహిళలు



తంగళ్లపల్లి: అమ్మవారికి పూజ చేస్తున్న బెంద్రం తిరుపతిరెడ్డి

దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరిస్తూ, భక్తి, శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తున్నారు. మండపాల్లో ఒకవైపు ప్రత్యేక పూజలు, మరోవైపు అన్నదానాలు నిర్వహిస్తున్నారు. పోతుగల్‌లో అన్నమనేని హన్మాన్‌ప్రసాద్, రాంప్రసాద్‌రావు అన్నదానం చేశారు. ఇల్లంతకుంటలో దుర్గామాత మండపాలకు బీటీఆర్ ఫౌండేషన్ ద్వారా బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి విరాళం అందజేశారు.

– ముస్తాబాద్/బోయినపల్లి/తంగళ్లపల్లి/కోనరావుపేట

నియామకం

మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పల్లవి



నియామక పత్రాన్ని అందుకుంటున్న పల్లవి

వీర్నపల్లి: మండల కేంద్రానికి చెందిన పిట్ల పల్లవిని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిట్ల పల్లవిని నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు జోగుల మంజుల పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సాయినగర్‌లో సోమవారం టాటా మ్యాజిక్ యూనియన్ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా బొల్లి రామ్మోహన్, అధ్యక్షుడు వల్లాల వెంకటేశం, ఉపాధ్యక్షుడు పాముల రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎల్లె సత్యనారాయణ, క్యాషియర్ వినోద్‌కుమార్, ముఖ్య సలహాదారు ప్రసాద్, ప్రచార కార్యదర్శి ఇమ్రాన్‌ను ఎన్నుకున్నారు.

ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉన్నత లక్ష్యంతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అధ్యాపకులు కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, ముస్తాబాద్ ప్రిన్సిపాల్ జ్ఞాపచారి, మాజీ జెడ్పీటీసీ నర్సాగౌడ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలిచ్చి మరిచిన బీఆర్ఎస్

సిరిసిల్లటౌన్: నేత కార్మికుల ఓట్లతో గెలుస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వారికిచ్చిన హామీలన్నీ మరిచిందని సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు పంతం రవి విమర్శించారు. సోమవారం సిరిసిల్ల కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా ఉన్న కేటీఆర్ నేత కార్మికులకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేకపోవడం శోచనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో నేతన్నలు ఓట్లు వేయకుండా బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. సిరిసిల్లలో నూలు డిపో ఏర్పాటు, వర్కర్ టూ ఓనర్ పథకం తదితర హామీలేవీ నెరవేర్చకుండానే మళ్లీ ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. సమావేశంలో సీనియర్ నాయకులు మల్లేశం, చంద్రమౌళి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు?

చందుర్తి: వరుస చోరీలతో చందుర్తి మండలాన్ని వణికించిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. గత సెప్టెంబర్ 14న మూడపల్లి అమ్లేట్ గ్రామమైన గోస్కులపల్లెలో రెండిళ్లలో దొంగతనం చేసి, బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఆరోపించారు. అదే నెల 23న మల్యాలకు చెందిన దేశెట్టి రాజయ్య ఇంట్లో చొరబడి, బంగారం చోరీ చేశారు. ఈ ఘటనలను పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. అనుమానితుల సీసీ ఫుటేజీలను 20 రోజుల క్రితమే స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకునేందుకు నిఘా పెట్టి, గత శనివారం జగిత్యాల జిల్లాకు చెందినవారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎక్కడెక్కడ చోరీలు చేశారో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉనికి కోసం అసత్య ప్రచారాలు మానుకోవాలని గంభీరావుపేట సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు అన్నారు. విలేకరులతో సోమవారం సర్పంచ్ మాట్లాడుతూ గంభీరావుపేట మండల కేంద్రంలో కనివినీ ఎరగని రీతిలో అభివృద్ధి పనులు చేశామన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో గంభీరావుపేట అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ప్రజల్లో పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ అసత్య అరోపణలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో మంత్రి కేటీఆర్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేయబోమని చెప్పిన దమ్మున్న నాయకుడు కేటీఆర్ అని అన్నారు.

నాయకులకు మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశం

- కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి వెళ్లాలని సూచన
- మండలాల వారీగా సమావేశం



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వేములవాడ: నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మార్గనిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని 8 మండలాల నాయకులతో విడివిడిగా సమావేశమైన మంత్రి కేటీఆర్ ఈమేరకు మార్గ నిర్దేశనం చేశారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో స్వాగతం



బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతున్న నాయకులు

వేములవాడ: వేములవాడకు మంత్రి కేటీఆర్ సోమవారం మధ్యాహ్నం వస్తుండటంతో నందికమాన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు నివాసంలో నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన నాయకులతో ఆయన విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన వ్యూహాలను వారికి వివరించారు.

జంగ్ తెలంగాణ

కేటీఆర్‌తో వస్త్ర పరిశ్రమ అభివృద్ధి

సిరిసిల్లఅర్బన్: మంత్రి కేటీఆర్‌తోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందిందని సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అన్నారు. సోమవారం చేనేత వస్త్ర వ్యాపారం సంఘం భవనంలో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కాటన్ వస్త్ర పరిశ్రమ సైజింగ్, డైయింగ్ పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షుడు ఎనుగుల ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ సాప గణేష్, కోశాధి కారి శ్రీగాధ విష్ణు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

తంగళ్లపల్లి: మండలంలో ఇంటింటికి తిరుగుతూ బొట్టుపెట్టి ఆహ్వానించారు. పవర్‌లూం కార్మికుల వద్దకు వెళ్లి బతుకమ్మ చీరల గురించి వివరించి బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు’



రసమయిని గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: తెలంగాణ అభివృద్ధి ఆగేది లేదని కారును, సారును, సర్కారును ఎవరూ ఆపేది లేదని కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు అన్నారు. మండలంలోని రామోజిపేట గ్రామంలో సోమవారం మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆయనకు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే రసమయి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అందిస్తున్న ప్రజాసంక్షేమ పథకాలతోపాటు ఎమ్మెల్యే రసమయి చేస్తున్న అభివృద్ధికి ఫిదా అయ్యామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో కాంగ్రెస్ భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట ఎంపీపీ వూట్కూరి వెంకటరమణా రెడ్డి, మానకొండూరు కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పొత్తూరు నుంచి ఇల్లంతకుంట బస్టాండ్ వరకు వందల సంఖ్యలో బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పొత్తూరు మాజీ సర్పంచ్ ఆకుల సత్యం, కందికట్కూర్ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమతి మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, పత్తికుంటపల్లె ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, వల్లంపట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమణరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

గత హామీలకు దిక్కులేదు

- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు
- బీఆర్ఎస్ మేనిఫెస్టోపై విమర్శలు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకే దిక్కు లేదని.. మళ్లీ ఇప్పుడు కొత్త హామీలతో మభ్యపెడుతున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు ఆరోపించారు. మండలంలోని లక్ష్మీపూర్, పాపయ్యపల్లె గ్రామాల్లో సోమవారం ఇంటింటికి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసిన సోనియాగాంధీ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఏరెడ్డి వెంకట్‌రెడ్డి, చుక్క రాజశేఖర్, పొన్నాల పర్శరాం, నాగరాజు, మల్లేశం, లక్ష్మీరాజం, శ్రీనివాస్, భరత్ గౌడ్, ప్రశాంత్, తిరుపతియాదవ్, అరెపల్లి బాలు, చందు, శ్యామ్, తిరుపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

‘గ్యారంటీ హామీలతో అధికారం ‘హస్త’గతం’



గ్యారంటీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ అవినీతి పాలనకు ఈ ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని, సోనియా ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలతో కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలంలోని నారాయణపూర్, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేటలో సోమవారం గడపగడపకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ఓటమి ఖాయమైందని, డబ్బులు, మద్యం పంపకాలకు అధికార పార్టీ ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుంటుందన్నారు. వారి అవినీతి పాలనను అంతమొందించేందుకు కార్యకర్తలు ప్రజలను సమాయత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే

ముస్తాబాద్: ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే రాబోతుందని రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్తాబాద్‌లో మహ్మద్ నవాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులకు సోమవారం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు మూడోసారి ఎన్నుకునేందుకు నిర్ణయించుకున్నారన్నారు. సన్నబియ్యం, రూ.400కే సిలిండర్, రైతులకు ఎకరాకు రూ.16 వేల సాయం వంటి పథకాలు ప్రభంజనం సృష్టిస్తాయన్నారు. ఎంపీపీ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్వర్, నవాజ్, కిషన్‌రావు, మనోహర్, స్వామి, అన్వర్ పాల్గొన్నారు.